క్లుప్తంగా

భూసర్వేతో రైతులకు భద్రత



రైతులతో మాట్లాడుతున్న వెంకట చెన్నయ్య

కొలిమిగుండ్ల: జగనన్న భూహక్కు–భూసర్వే కార్యక్రమంతో రైతుల మధ్య ఏర్పడిన వివాదాలు తొలగిపోయి పూర్తిగా భద్రత ఏర్పడుతుందని భూసర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వెంకట చెన్నయ్య అన్నారు. బుధవారం కొలిమిగుండ్లలో జరుగుతున్న భూసర్వేను పరిశీలనకు వచ్చిన ఆయన రైతులతో చర్చించారు. తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, మండల సర్వేయర్ సరితతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కొలిమిగుండ్ల మండలంలో 14 గ్రామాల్లో డ్రోన్ షాట్‌లు తీశామన్నారు. ప్రస్తుతం మీర్జాపురం, బితాడిపత్రి, కొలిమిగుండ్లలో భూసర్వే చేపడుతున్నామన్నారు. రైతుల సమక్షంలోనే కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి



గృహ నిర్మాణాల పురోగతిపై చర్చిస్తున్న పీడీ

బేతంచెర్ల: నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ విజయభాస్కర్ నాయుడు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఎంపీడీఓ వెంగన్న, ఏఈతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, సొంతింటి కల సాకారం చేసుకోవాలని సూచించారు. వివరించాలన్నారు.

మోడల్ స్కూల్లో సాంకేతిక విద్య

బేతంచెర్ల: ప్రభుత్వం మోడల్ స్కూలు విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసిందని ప్రిన్సిపాల్ గుంగుల నాగరాజు తెలిపారు. మండలంలోని ఏపీ మోడల్ స్కూలుకు మంజూరైన రూ.12.50 లక్షల విలువ స్మార్ట్ టీవీలను బుధవారం తరగతి గదుల్లో అమర్చారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ విద్యార్థులు సైతం గొప్ప చదువులు చదివి ప్రయోజకులు కావలన్నదే ప్రభుత్వ సంకల్పం అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వేణు, రామ్మోహన్, కౌసర్, విజయ కుమారి, మల్లీశ్వరి, భాస్కర్ రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ తండా గ్రామంలోని శంకర్ నాయక్ దగ్గర నాటుసారా తీసుకొచ్చి గోరుమానుకొండలో విక్రయిస్తున్న చాకలి చిన్న సాలన్న అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. అతని నుంచి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అదేవిధంగా శంకర్ నాయక్ పై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్థిక సాయం

బేతంచెర్ల: మండల ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నూరుల్లా ఖాద్రి అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యాడు. ఈ మేరకు యూనియన్ నాయకులు తమవంతుగా రూ. 21,500 అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మద్దిలేటి పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే కేసులు

బేతంచెర్ల: మండలంలోని కిరాణ, ప్రభుత్వ చౌక దుకాణాల్లో తూకాల్లో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని డోన్ తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ ఖాజా హుసేన్ హెచ్చరించారు. స్థానిక చౌక దుకాణాల కాటాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా చౌక దుకాణం కాటాలకు సిబ్బందితో ముద్రలు వేయించారు. కిరాణం, చౌక దుకాణాల్లో తూకాలను కరెక్టుగా వేయాలని, ఎంఆర్‌పీ ధరలకే సరుకులను విక్రయించాలని సూచించారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

కొలిమిగుండ్ల: ఉపాధ్యాయులు తమ ప్రతిభ పాటవాలతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు రాజయ్య, అబ్దుల్ కలాం సూచించారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల శిక్షణా సమావేశం బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతు ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. విద్యార్థులు బడి మధ్యలోనే చదువులు ఆపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు మద్దిలేటి, కమల తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బనగానపల్లెరూరల్: స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో పదోన్నతిపై ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను బుధవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, మండల అధ్యక్షుడు వెంకటకృష్ణుడు, నాయకులు సుబ్బరాయుడు, రామకృష్ణ. కుమార్‌బాబుయాదవ్, బాషా, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు



బనగానపల్లెలో ఇమాంఖాసీం పీర్లకు ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు



కోవెలకుంట్లలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మేజర్ గ్రామ పంచాయితీ కోవెలకుంట్లతోపాటు మండలంలోని గ్రామాల్లో బుధవారం చిన్న సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చిన్నబార్‌ఇమాం, పెద్దబార్‌ఇమాం, అంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డి బావి వీధుల్లో పదిచోట్ల బీబీఫాతిమా, ఇమాం కాశీం, అజరత్ అలీ అక్బర్, చిన్నబార్‌ఇమాం, ఇమాంకాశీం, పెద్దబార్‌ఇమాం, హాజరత్ అబ్బాస్, హాజరత్ అలీ అబ్బాస్, దస్తగిరిస్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్ల దేవుళ్లను కొలువుంచారు. చిన్న సరిగెత్తును పురస్కరించుకుని మెయిన్ బజార్‌లో పీర్ల ఊరేగింపు కొనసాగింది. భక్తులు పీర్ల దేవుళ్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం మధ్య సరిగెత్తు జరుగనుంది.

బనగానపల్లెరూరల్: మొహర్రం వేడుకల్లో భాగంగా మండల కేంద్రం బనగానపల్లె పట్టణంలో బుధవారం చిన్నసరిగెత్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరిగాయి. పట్టణంలోని ఆస్థానంలో వెలసిన శ్రీహజరత్ అబ్బాస్, దొరకోటలో వెలసిన పీర్లు, బొమ్మల పీర్లు, పోలీసు సర్కిల్ కార్యాలయం వద్ద ఉన్న ఇమాం ఖాసిం పీర్లతో పాటు పలు చావిడిల్లో కొలువైన పీర్లను కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకొని మొక్కుబడులు చెల్లించారు. పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట ఉన్న ఇమాం ఖాసిం పీర్ల చావిడి ఎదురుగా అగ్ని గుండం ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి తర్వాత అవుకు మండలంలోని అన్నవరం గ్రామంలో వెలసిన ఇమాంఖాసీం పీర్లతో వచ్చిన భక్తులు అగ్ని గుండంలో నడుచుకుంటూ వెళ్లడం ఆనవాయితీ.

డోన్ టౌన్ : మొహరం వేడుకల్లో భాగంగా బుధవారం చిన్న సరిగెత్తును ఘనంగా జరిగాయి. పీర్లకు ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. డోన్ పట్టణంలోపాటు గ్రామాల్లో వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి.

ప్యాపిలి: మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం చిన్న సరిగెత్తును ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పీర్ల స్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చిన్న సరిగెత్తు సందర్భంగా స్థానిక కిందిగేరిలో వెలసిన పీర్ల స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. 28వ తేదీ పెద్దసరిగెత్తు, 29వ తేదీను పీర్లు ఏటికి వెళ్లడంతో మొహర్రం వేడుకలు ముగియనున్నాయి.

కొలిమిగుండ్ల: మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం మండల వ్యాప్తంగా చిన్న సరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్న సరిగెత్తు సందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం వీధుల్లో పీర్లకు ఊరేగింపు నిర్వహించారు.



పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్ని గుండం



కొండపేటలోని జెండ కట్ట వద్ద కొలువు దీరిన పీర్లు



ఖాజా బందేనవాజ్ పీర్ల చావిడిలో పీర్లకు చదివింపులు చేస్తున్న దృశ్యం



బందార్లపల్లెలో ప్రత్యేక అలంకరణలో పీర్లు

అవుకు: మండల కేంద్రం అవుకుతోపాటు గ్రామాల్లో బుధవారం చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్ల దేవుళ్లను కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కళాకారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

నేడు జగనన్న సురక్ష

సంజామల : మండల పరిధిలోని కానాల గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందనివారు, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు,ఆ ధార్ కార్డులో మార్పు తదితర 11రకాల ప్రభుత్వ సేవలను సంబంధించి వివరాలు పరిశీలించి వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అవుకు: మండల కేంద్రం అవుకు–3 సచివాలయంతోపాటు మెట్టుపల్లె, శివవరం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. వారం రోజులుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్స్‌కు సంబంధించి పత్రాలు సేకరించారన్నారు. ఈ మేరకు పరిశీలించి ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

డోన్ టౌన్ : స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలోని రాయల్ సర్కిల్ వద్ద స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ సేవా దృక్పథంతో ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఉదయం 9.30గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని, యువకులు, సమాజ సేవకులు తరలివచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ వెంగన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారుల అభివృద్ధిని నివేదికలను సభకు వివరించారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌తోపాటు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. మండలంలోని 35 ప్రభుత్వ పాఠశాలలో సుమారు 4.50 కోట్లతో నాడు–నేడు పనులు జరుగుతున్నాయని, ప్రస్తుతం 50 శాతం పనులు పూర్తయ్యాయని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. భూమి లేని నిరుపేదలను గుర్తించి భూ పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు. పశు వైద్య సేవలు, పశువుల బీమా తదితర విషయాలను వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి వివరించారు. గ్రామాల సీసీ రోడ్లతోపాటు, సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, పాలుట్ల రంగస్వామి ఆలయ రహదారికి ప్రతి పాదనలు పంపుతున్నట్లు పంచాయతీ రాజ్ ఇంజినీర్ గణేష్ తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వికలాంగులు పెళ్లైన 30 రోజులలోపు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో మండలాన్ని అన్నివిధాలుగా తీర్చిదిద్దుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసుతుల కల్పిస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలో 12647 మందికి ఉచితంగా వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశామని ఎంపీపీ గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రంగస్వామి, ఏపీఎమ్ లింగమయ్య, ఏపీఓ శేషన్న, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, గుమ్మగాలరాజు, తిమ్మయ్య, వెంకటలక్షమ్మ, మద్దమ్మ, వెంకట సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యులు రామచంద్రారెడ్డి, నాగేషు, మునేశ్వర్‌రెడ్డి, రామనాథం, మరియమ్మ,శాంతి, ఇందిర, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరసనలు

డోన్ టౌన్ : విద్యుత్ శాఖలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గురువారం నుంచి చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో ఉద్యోగులు, సిబ్బంది, కంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం జేఏసీ డోన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమ కార్యచరణ ప్రణాళికలు రూపొందించుకున్నట్లు జేఏసీ ఉమ్మడి కర్నూలు జిల్లా చైర్మన్ గణేష్ తెలిపారు. కార్యక్రమంలో డోన్ డివిజన్ జేఏసీ అధ్యక్షులు భాస్కర రావు, ఈఈ ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి రమణస్వామి, కన్వీనర్ లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్, ఇంజినీరింగ్ వర్కర్స్‌కు ప్రభుత్వం అండ



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన చైర్మన్, ఎంపీపీ

డోన్ : మెకానిక్, ఇంజినీరింగ్ వర్కర్స్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని, నియోజకవర్గ కేంద్రం డోన్‌లో ఆటోనగర్ ఏర్పాటుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారని రాష్ట్ర మీట్ కార్పొరేషన చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు తెలిపారు. స్థానిక గుత్తిరోడ్డులో మెకానిక్, ఇంజినీరింగ్ వర్కర్స్ ఏర్పాటు చేసుకున్న నూతన కార్యాలయాన్ని బుధవారం లేబర్ అధికారిణి నీలిమ, తహసీల్దార్ విద్యాసాగర్‌తో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, రైల్వే నాగేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ డోన్‌లోని మెకానిక్‌లు, ఇంజినీరింగ్ సిబ్బంది ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు తమ సహకారం ఉంటుందన్నారు. లేబర్ అధికారిణి నీలిమ మాట్లాడుతూ ప్రతి కార్మికుడు లేబర్ కార్డు పొందితే అనుకోని పరిపరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగినా ప్రభుత్వం నుంచి రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి షాపును రిజిస్టర్ చేసుకొని లైసెన్స్ తీసుకుంటే ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ అధ్యక్షునిగా ఉసేన్, సహాయ కార్యదర్శులుగా ఇమాములు, పెయింటర్ మాబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మెకానిక్ సంఘం నాయకులు సేట్, జీవన్, షేక్షా, పరుశురాముడు, రామక్రిష్ణ, వెంకటేష్, లింగం, గౌస్, నాయుడు, రఫీ, ఇస్మాయిల్, పీరా, ఖాదర్, సుభాన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్ లేట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని



పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రతి సామాజివర్గానికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. కుల మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మండల పరిధిలోని రామిరెడ్డి పల్లె పేరుసోముల గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నబాబు, తహసీలోద్దర్ మల్లికార్జున రావు, ఎంపీడీఓ నాగకుమార్, రామిరెడ్డిపల్లె సర్పంచ్ సోమసుందర్ రెడ్డి, పేరుసోముల సర్పంచ్ అందనం శృతి తదితరులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. చిరుజల్లులు కురుస్తున్నా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేను ఆయా కుటుంబాల సభ్యులు ఆప్యాయంగా పలుకరించారు. వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సమస్యలపై ఆరా తీశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని పేదలు వివరాలు అందజేస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్ లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సాంకేతిక కారణాల మూలంగా మిగిలిపోయిన పేదలను గుర్తించి సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అధికారులు అందజేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రహమతుల్ల, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటపాడు రామ సుబ్బయ్య, లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, శివరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రామిరెడ్డి పల్లెకు వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రూ.5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రామిరెడ్డిపల్లెకు చెందిన 98 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అదేవిధంగా రజకులు దోభీ ఘాట్ నిర్మించుకునేందుకు కేటాయించిన 80 సెంట్లు, ముస్లింల శ్మశాన వాటికకు కేటాయించిన రెండు ఎకరాలు, బీసీ, ఎస్సీ శ్మశాన వాటికకు కేటాయించిన మూడు ఎకరాలకు సంబంధించిన పత్రాలను ఆయా సామాజిక వర్గాలకు ఎమ్మెల్యే అందజేశారు. రామిరెడ్డిపల్లెను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా కాటని తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేట కాలనీకి చెందిన చాకలి వెంకటేశ్వరమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను మృతురాలి అత్త తిరుపాలమ్మకు కౌన్సిలర్ బుగ్గన సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన భాస్కర్‌రెడ్డి, వలంటీర్ జ్యోతి అందజేశారు.

రుణ యాప్‌లను రద్దు చేయాలి

డోన్ టౌన్ : పేద, మధ్య తరగతి ప్రజల ప్రాణాలు బలిగొంటున్న రుణ యాప్‌లను రద్దు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏఈ నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో రుణ యాప్‌ల ఒత్తిళ్ల మూలంగా రాష్ట్రంలో చాలామంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేకోవలో డోన్‌కు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం బాధకరమన్నారు. రుణ యాప్‌లను రద్దు చేయాలని గతంలోనే మానవ హక్కుల సంఘానికి, గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని, డీజీపీకి పోస్టు ద్వారా విన్నవించామని చెప్పారు.

గోదాములను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌కుమార్

డోన్ : రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం నిర్మించిన గోదాములను సద్వినియోగం చేసుకోవాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్ సూచించారు. డోన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ చైర్మన్ తిరునాంపల్లె తిరుమలరెడ్డి అధ్యక్షతన సొసైటీ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ గోదాములపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దిగుబడులను తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం గోదాములు నిర్మించిందన్నారు. గిట్టుబాటు ధరలు లేని సమయంలో గోదాముల్లో నిల్వ ఉంచుకుని, ధర వచ్చినప్పుడే అమ్ముకోవాలని సూచించారు. గోదాముల్లో నిల్వ ఉంచిన పంటలకు ప్రభుత్వం రైతుకు అవసరమైతే 80 శాతం బ్యాంకు రుణం ఇప్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారి విజయకుమారి, సబ్ డివిజనల్ అధికారి వెంకటేష్‌బాబు, రిజిస్ట్రార్ మల్లికార్జునగౌడ్, ఏఈఓ ప్రమీల, సీఈఓ వెంకటసుబ్బయ్య, కొత్తకోట ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు రాఘవరెడ్డి, హనుమన్న, గోవిందురెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

డోన్ : బిందు, తుంపర సేద్యంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా మైక్రో ఇరిగేషన్ ముఖ్య అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని యు కొత్తపల్ల రైతుభరోసా కేంద్రంలో డోన్, ప్యాపిలి ఆర్‌బీకే వ్యవసాయ సిబ్బందికి బిందు, తుంపర సేద్యం పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉద్యానవన అధికారి కళ్యాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోరుకు సదుపాయం ఉన్న రైతులందరూ మైక్రో ఇరిగేషన్ విధానం వైపు అడుగులు వేసేందుకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో పరికరాలను అందజేస్తుందన్నారు. కేవలం 10శాతం మాత్రమే రైతు చెల్లించాల్సి ఉందన్నారు. డ్రిప్స్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నదే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని తహసీల్దార్ పుష్పకుమారి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డీవీ శేషిరెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు గ్రామ సచివాలయ ఆవరణలో సదస్సు ఏర్పాటు చేశారు. సచివాలయ పరిధిలోని లింగాల, రేవనూరు గ్రామాల్లో అన్ని అర్హతలు ఉండి ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాలు వర్తించని లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. అనంతరం పలువురికి కుల, ఆదాయ, పుట్టినతేదీ సర్టిఫికెట్లు, వన్‌బీ అడంగళ్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఏపీఓ శ్రీవిద్య, ఏపీఎం గురుస్వామి, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య, ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లెరూరల్: వర్షా కాలంలో సోకే సీజనల్ వ్యాధల పట్ల విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. పట్టణంలోని ఎంపీపీ పాఠశాలను బుధవారం మెడికల్ ఆఫీసర్ సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని, భోజనానికి ముందు తరువాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. దగ్గు, జ్వరం, తలనొప్పి తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.



భారీ వర్షంతో జలమయమైన కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

వర్షం.. హర్షం..!



బిజనవేముల వద్ద బెండ పంటలో నిల్వ చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మండలాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. కోవెలకుంట్ల మండలంలో 24 మి.మీ, సంజామల– 15.8 మి.మీ, దొర్నిపాడు – 19.2 మి.మీ, అవుకు – 9.2 మి.మీ, ఉయ్యాలవాడ – 8.2 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 7.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం జోరు కొనసాగుతుండటంతో ప్రధాన వీధులు జలమయమయ్యాయి. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం రైతులు మొక్కజొన్న, మినుము, పత్తి, పెసర, బెండ, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. పైరు మొలకెత్తి నెలన్నర కావస్తున్నా ఇప్పటి వరకు ఆశించిన వర్షాలు పడలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలు అనుకూలంగా మారటంతో రైతులు ఊరట చెందుతున్నారు. ప్రస్తుతం ఆయా పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. సాగు చేసిన పైర్లకే కాకుండా సాగు చేయాల్సిన వివిధ పంటలకు వర్షాలు ఆశాజనకం మారటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

కొలిమిగుండ్ల: అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా వారం రోజుల నుంచి వాతావరం పూర్తిగా మారి పోయి తేలిక పాటి నుంచి మోస్తారు వర్షం కురుస్తుంది. ఆకాశంలో మబ్బులు కమ్ముకొని చలి ప్రభావం అధికం కావడంతో ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. ఈనెలలో సాధారణ వర్షపాతం 100.7 మి.మీ కాగా ఇప్పటి వరకు 54 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాలు కురిస్తే వాగులు,వంకలు పొంగి పొర్లి రాక పోకలకు అంతరాయం కలిగించే బ్రిడ్జిలను గుర్తించారు. అలాగే పాత మట్టి మిద్దెల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ సిబ్బందికి సూచించారు.

బనగానపల్లెలో మోస్తరు వర్షం

బనగానపల్లెరూరల్: మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు మండల వ్యాప్తంగా 42.2 మీ.మీల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజోన్న, కంది తదితర పంటలకు ఈ వర్షం ఊపిరిపోసింది. ప్రస్తుతం కొర్ర, వరి, జొన్న, సజ్జ, మినుము, పెసలు తదితర పంటలు సాగుకు ఉపయోగకరమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.